సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 7 । డిసెంబర్ । 2024



బాల్యానికి మూడుముళ్లు

బడిబాట పట్టాల్సిన బాల్యం ఏడు అడుగులతో బందీ అవుతోంది.. బాల్య వివాహాలతో జీవితానికి చిక్కుముడి పడుతుంది. చిన్నారి పెళ్లి కూతురికి పుస్తెల దండనగా మారుతోంది.


10లో



సుదర్శన హోమానికి విరాళం

సఖినేటిపల్లి : అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నిత్య సుదర్శన హోమానికి బోతంశెట్టి సాంబశివరావు పార్వతి, కృష్ణ రాజేష్ కుటుంబ సభ్యులు (హైదరాబాద్) రూ.40 వేలు విరాళంగా అందజేశారు.

డెల్టా కాలువలకు 9 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 9 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో 17.382 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

సర్కారీ సమావేషాలు

- మెగా పేటీఎం పేరుతో నిర్వహణ
- నేడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో భేటీ
- డ్రాప్ అవుట్స్ తగ్గించేందుకు అంటూ హడావుడి
- ప్రభుత్వ విద్యకు ప్రభుత్వం తూట్లు
- 2.80 లక్షల మందికి 'తల్లికి వందనం' బకాయిలు
- నిలిచిపోయిన 'నాడు– నేడు' పనులు



కపిలేశ్వరపురం మండలం నల్లూరులో అసంపూర్తిగా జెడ్పీ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం

విద్యపై కూటమి సర్కారు కక్షకట్టింది.. పేదలకు చదువు చేరువ కాకుండా చేస్తోంది.. ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేసింది.. ఇలా ఈ ఏడాది సర్కారు బడుల్లో డ్రాప్ అవుట్స్ అనివార్యమైంది.. ఈ నేపథ్యంలో వీటిని తగ్గించేందుకు మెగా పేటీఎం పేరుతో సమా'వేషాలు' నిర్వహిస్తోంది.. ప్రభుత్వ విద్యకు తూట్లు పొడిచి ఇప్పుడేమో ఏమీ తెలియనట్టు తల్లిదండ్రుల సమావేశాలకు సమాయత్తమైంది. ఇందులో భాగంగా మెగా పేటీఎం పేరుతో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించనుంది.

సాక్షి, అమలాపురం: చేసేది పిసరంత.. హడావుడి కొండంత. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి ఇదే తంతు. ఇప్పుడు పాఠశాలల్లో మెగా పేటీఎం పేరుతో హంగూ ఆర్భాటాలు చేస్తోంది. తల్లికి వందనం, నాడు-నేడుకు నిధులు కేటాయింపు... వంటి వాటిని కొండెక్కించిన కూటమి ప్రభుత్వం వాటిని మరుగున పరిచేందుకు ఇప్పుడు మెగా పేటీఎం అంటూ ముందుకు వచ్చింది. పాఠశాల విద్యకు కూటమి ప్రభుత్వం గ్రహణం పట్టించడంతో పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ పెరిగారు. దీంతో కంగుతున్న విద్యా శాఖ పిల్లలను ప్రభుత్వ పాఠశాల బాట పట్టించేందుకంటూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 7వ తేదీ శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో మెగా పేటీఎం కార్యక్రమాన్ని నిర్వహించనుంది. జిల్లాలో 1,582 పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరగనుంది. ఇందులో ప్రైమరీ స్కూల్స్ 1,276, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ 69, ఉన్నత పాఠశాలలు 237 ఉన్నాయి. సుమారు 97,712 మంది విద్యార్థులు చదువుతుండగా, వారిలో 46,598 మంది బాలురు, 51,114 మంది బాలికలు ఉన్నారు. వీరి తల్లిదండ్రులు ఈ సమావేశాలను ఆయా పాఠశాలల్లో నిర్వహించనున్నారు.

పాఠశాల విద్యకు తూట్లు

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాఠశాల విద్యకు మహర్దశ పట్టింది. నాడు– నేడులో కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలను తీర్చిదిద్దింది. ఏటా క్రమం తప్పకుండా జగనన్న అమ్మ ఒడి ద్వారా పిల్లల తల్లుల ఖాతాలో నేరుగా నిధులు రూ.15 వేలు జమ చేసింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా పాఠశాలలో చదువుకునే విద్యార్థుల ఒకొక్కరికీ రూ.పది హేను వేల చొప్పున ఇస్తామంది. కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఇస్తామని ఊదరగొట్టింది. అయితే ఇప్పటి వరకూ నయా పైసా కూడా విడుదల చేయలేదు. కూటమి నేతల హామీ ప్రకారం జిల్లాలో సుమారు 2.08 లక్షల మందికి తల్లికి వందనం అందించాలి.
- పాఠశాలల్లో నాడు– నేడు రెండో దశ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రెండో దశలో చేపట్టిన పనుల్లో ఇప్పటి వరకూ 57 పాఠశాలల్లో పూర్తయ్యాయి. 37 పాఠశాలల్లో పనులు బేస్‌మెంట్ కన్నా తక్కువగా, 31 పాఠశాలల్లో బేస్‌మెంట్ స్థాయి, 50 పాఠశాలల్లో లింటల్ లెవిల్‌లో, 77 పాఠశాలల్లో పనులు రూఫ్ లెవిల్‌లో, 122 పాఠశాలల్లో పనులు చివరి దశలో ఉన్నాయి. 28 పాఠశాలల్లో పనులు ఇంకా మొదలు కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వీటిపై పర్యవేక్షణ, నిధులు విడుదల దాదాపు నిలిచిపోయింది. దీంతో నాడు– నేడు లక్ష్యం నెరవేరకుండా పోయింది.
- 1,573 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం వంట, హెల్పరుగా పని చేస్తున్న వారికి కుకింగ్ చార్జీలు అందించాల్సి ఉంది. కానీ రెండు నెలలుగా బకాయిలు చెల్లించడం లేదు. ఆయా పాఠశాలల్లో 1,660 మంది పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.ఆరు వేల చొప్పున గౌరవ వేతనం అందించాలి. జిల్లాలో వీరికి రూ.4.98 కోట్ల వరకూ చెల్లించాలి. కానీ ఇంత వరకూ సొమ్ము విడుదల చేయలేదు. 212 మంది నైట్ వాచ్‌మెన్‌లకు నెలకు రూ.ఆరు వేల చొప్పున రూ.63 లక్షలు బకాయిలు ఉన్నాయి.

పేరు మార్పుతో సరి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ అమ్మ ఒడి పథకానికి తల్లికి వందనంగా, నాడు– నేడును మన బడి– మన భవిష్యత్‌గా, జగనన్న గోరు ముద్దకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంగా పేరు మార్పులు చేసిన కూటమి ప్రభుత్వం వాటికి నయా పైసా కూడా విడుదల చేయకపోవడం.. గౌరవ వేతనాలు చెల్లించకపోవడం కొసమెరుపు.

పండగ చేయాలంట..

జిల్లాలోని మెగా పేటీఎం కార్యక్రమాన్ని పండగలా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు పాఠశాలల్లో విద్యార్థులను బట్టి నిధులు మంజూరు చేస్తామని చెప్పింది. విద్యార్థుల తల్లిదండ్రులకు స్వీట్లు, స్నాక్స్ అందించడంతోపాటు పాఠశాలలను అందంగా అలంకరించేందుకు, తల్లిదండ్రులకు ఆటల పోటీల నిర్వహించడం, వారికి బహుమతులు అందజేయడం చేయాలి. అలాగే టెంట్‌లు, కుర్చీలు, మైకులు, బొకేలు, పూల దండలు వంటి ఖర్చులకు ప్రభుత్వం నిధులు ఇస్తామని చెప్పింది. అయితే ఒకటి నుంచి పది మంది వరకూ విద్యార్థులు ఉంటే రూ.వెయ్యి, పదకొండు నుంచి 25 మంది వరకూ ఉంటే రూ.1,200లు, 26 నుంచి 50 మంది వరకూ రూ.1,600లు, 51 నుంచి 70 మంది వరకూ పిల్లలు ఉంటే రూ.రెండు వేలు, 71 నుంచి 10 మంది వరకూ రూ.2,400లు, 101 నుంచి 200 మంది వరకూ రూ.3 వేలు, 201 నుంచి 300 మంది వరకూ రూ.నాలుగు వేలు, 301 నుంచి 400 మంది వరకూ రూ.ఐదు వేలు, 401 నుంచి 500 మంది వరకూ రూ.ఆరు వేలు, 501 నుంచి 600 మంది వరకూ రూ.ఏడు వేలు, 601 నుంచి 700 వరకూ రూ.8 వేలు, 701 నుంచి 800 మంది వరకూ రూ.తొమ్మిది వేలు, 801 నుంచి 900 మంది వరకూ రూ.పది వేలు, 901 నుంచి వెయ్యి మంది వరకూ రూ.పదకొండు వేలు, 1001 నుంచి 1,500 మంది వరకూ రూ.12 వేలు, 1,501 నుంచి రెండు వేల మంది వరకూ రూ.పదమూడు వేలు, 2001 నుంచి ఆ పైన ఉన్నవారికి రూ.14 వేల వరకూ ఖర్చులకు మంజూరు చేసింది. అయితే ఇచ్చే నిధులకు, పెట్టే ఖర్చులకు పొంతన లేకుండా ఉందని ఉపాధ్యాయులు వాపోతున్నారు.



రావులపాలెం జెడ్పీ హైస్కూల్‌లో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు



ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆగిన అదనపు తరగతి గదుల భవన నిర్మాణం

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు అంధుల ఎంపిక



రాష్ట్ర, జిల్లా స్థాయి యోగా పోటీలకు ఎంపికైన అంధ విద్యార్థులతో గురువు డాక్టర్ శ్రీనివాస్

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమంలో ఉచిత యోగా శిక్షణ పొందుతున్న స్థానిక లూయి అంధుల పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు దివ్యాంగుల కోటాలో రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారని ఆ యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు. ఈ ఆరుగురు అంధ విద్యార్థులకు తమ యోగాశ్రమంలో రెండేళ్లుగా యోగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఈ పోటీలకు విద్యార్థులు కె.ధన బాబు, ఎ.పవన్‌కుమార్, టి.సందీప్‌కుమార్, కె.శివ నాగబాబు, కె.సత్తిబాబు, జి.వంశీ ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 10న వైజాగ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అలాగే తమ యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న లూయి అంధుల పాఠశాలలకు చెందిన పి.దుర్గ, ఎస్.కార్తీక్, ఎం.దుర్గారావు, పి.సతీష్, ఎల్.ప్రవీణ్, ఎం.కార్తీక్‌లు జిల్లా స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరు ఈ నెల 9న కాకినాడలో జరిగే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి యోగా పోటీలకు ఎంపికైన అంధ విద్యార్థులను యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్, లూయి అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ రామయాణం శ్రీనివాసరావు అభినందించారు.

కాపునాడు బలోపేతానికి త్వరలో కమిటీలు

అమలాపురం టౌన్: కాపునాడు బలోపేతానికి రాష్ట్రంలో జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా త్వరలో కమిటీలు వేస్తామని రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు గిద్దా శ్రీనివాస నాయుడు అన్నారు. స్థానిక ఎర్ర వంతెన వద్ద కాపునాడు నాయకుడు నిమ్మకాయల సురేష్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కాపు నాయకుల సమావేశంలో నాయుడు మాట్లాడారు. అంతకుముందు నాయుడిని పలువురు కాపు నాయకులు స్వయంగా కలిసి కమిటీల ఏర్పాటుపై మాట్లాడారు. సమావేశంలో కాపు నాయకులు చిక్కాల రవిశంకర్, అరిగెల తేజ వెంకటేష్, గారపాటి నాగేశ్వరరావు, మురమళ్ల శివ రెడ్డినాయుడు, కొప్పుల భాస్కరరావు తదితరులు ప్రసంగించారు.

వీరేశ్వరస్వామి హుండీల ఆదాయం లెక్కింపు



వీరేశ్వరస్వామి ఆలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

ఐ.పోలవరం: నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వర స్వామివారి దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని శుక్రవారం అధికారులు లెక్కించారు. రాజోలు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.ప్రసాదరాజు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. 250 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.16,78,974, నిత్య కల్యాణం వద్ద హుండీ ద్వారా రూ.12,25,944, వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టు హుండీ ద్వారా రూ.1,96,487 ఆదాయం సమకూరింది. అలాగే 48 గ్రాముల బంగారం, 290 గ్రాముల వెండి, 2 విదేశీ డాలర్లు వచ్చాయని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మొత్తాన్ని స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడాలో జమ చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, పురోహితులు, కార్యాలయ సిబ్బంది, మాజీ చైర్మన్ శ్రీకతారి రామ వెంకటసుబ్బరాజు, దాట్ల ఇంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధికి పోటెత్తిన భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున రత్నగిరిపై పెద్ద సంఖ్యలో వివాహాలు జరగడంతో ఆలయ ప్రాంగణంలో నవదంపతుల సందడి నెలకొంది. రత్నగిరిపై 50కి పైగా వివాహాలు జరిగాయి. ఇవే ముహూర్తాలలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో వివాహాలు చేసుకున్నవారు కూడా స్వామివారి ఆలయానికి తరలివచ్చారు. వీరంతా సత్యదేవుని వ్రతాలాచరించి స్వామిని దర్శించుకున్నారు.

వైద్య శాఖలో అవినీతిపై విచారణ



ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో విచారణ చేస్తున్న సత్యనారాయణ

ముమ్మిడివరం: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో అధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై శుక్రవారం మరోసారి విచారణ చేపట్టారు. అవినీతిపై సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరగడంతో 'సాక్షి' దినపత్రికలో ఆరోగ్య శాఖలో అవినీతి జబ్బు అనే శీర్షికన కథనం రావడంతో ప్రభుత్వం స్పందించి విచారణకు ఆదేశించింది. గత బుధవారం విచారణాధికారిగా నియమితులైన జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి బీవీవీ సత్యనారాయణ ముమ్మిడివరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బందిని విచారించి లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించారు. అయితే శుక్రవారం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో విచారణాధికారి సత్యనారాయణ మరోసారి జిల్లాలో పలువురు పీహెచ్‌సీ వైద్యాధికారులను పిలిచి విచారణ చేపట్టారు. ఏ పని చేయాలన్నా డబ్బులు తీసుకుంటున్నారంటూ గతంలో వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు అందజేసిన విషయం తెలిసిందే. దీంతో తిరిగి విచారణకు హాజరైన 20 మంది వైద్యాధికారులు విచారణ పత్రంలో ఇచ్చిన అంశాలకు లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఏ పనికి ఎంత ఇచ్చారు.. ఎవరి ద్వారా సొమ్ము వసూలు చేస్తున్నారనే అంశాలను అందులో పొందుపరిచినట్లు సమాచారం. శనివారం మరోసారి ఏఎన్ఎంలు, ఇతర సిబ్బందిని కూడా విచారించనున్నారు. దీనిపై విచారణ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ ఆరోపణలపై కొన్ని ప్రశ్నలకు ఫిర్యాదుదారుల నుంచి లిఖిత పూర్వక వివరణ తీసుకుంటున్నామన్నారు. పూర్తి నివేదిక తయారు చేసి డీఎంహెచ్‌ఓకు అందజేస్తామన్నారు. ఇదిలా ఉంటే విచారణ అనంతరం పలువురు వైద్యులు బయటకు వచ్చి విలేకర్లతో మాట్లాడుతూ విచారణలో వాస్తవాలు వెలుగు చూస్తాయన్న నమ్మకం లేదన్నారు. అధికారులు విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే మూడు సార్లు విచారణకు పిలిచారని దూరం నుంచి వ్యయ ప్రయాసల కోర్చి వస్తున్నామని అంటున్నారు.

అప్పట్లో ఒప్పుకున్నా..

సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఆరోపణలపై గత నెల 28న డీఎంహెచ్‌ఓ విచారణ చేశారు. అప్పట్లో అవినీతి ఆరోపణలు వచ్చిన అధికారి స్వయంగా అవినీతికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. అయినా చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని పలువురు అంటున్నారు. జిల్లా కార్యాలయంలో వచ్చిన ఆరోపణలపై రాష్ట్ర స్థాయి అధికారిని నియమించకుండా, అదే కార్యాలయంలో పని చేసే అధికారిని నియమించడంపై విమర్శలకు తావిస్తోంది. దీనివల్ల వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

వసతి గృహ విద్యార్థులకు ఆరోగ్య బీమా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: జిల్లాలో సాంఘిక, వెనుకబడిన తరగతులు, రెసిడెన్షియల్ వసతి గృహాలు, చైల్డ్ కేర్ సెంటర్లలోని 8,383 మంది విద్యార్థులకు ఐసీఐసీఐ లాంబార్డ్ ఆరోగ్య బీమా వర్తింపజేస్తున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో ఐసీఐసీఐ లాంబార్డ్ ఆరోగ్య బీమా ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు, వసతి గృహ సంక్షేమ అధికారులకు గుర్తింపు కార్డుల జారీ, ఎం ప్యానల్ ఆసుపత్రుల్లో నగదు రహిత ఆన్‌లైన్ సేవలు వంటి అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులకు బీమా ద్వారా ఎం ప్యానల్ ఆసుపత్రుల్లో నగదు రహిత సేవలు అందించేందుకు ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఐసీఐసీఐ లాంబార్డ్ ప్రతినిధులు ఎస్.శ్రీనివాసరావు, శ్రావణ్, వెంకటేశ్వరరావు, ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజర్ చల్లా శ్రీను, రాజమహేంద్రవరం రీజినల్ హెడ్ భరత్ పాల్గొన్నారు.

జిల్లా స్పోర్ట్స్ మీట్‌కు సన్నాహాలు

జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌ను మొదటి దశలో విద్యార్థులకు, రెండో దశలో ఉద్యోగులకు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ నిర్వహణపై జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు, స్కూల్ గేమ్ ఫెడరేషన్ కోనసీమ కార్యదర్శుల కార్యవర్గ సభ్యులు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. 4, 5, 6 తరగతులను మొదటి కేటగిరీగా మండల స్థాయిలో, 7, 8, 9, తరగతులకు రెండో కేటగిరీగా డివిజన్ స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించాలన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్

భారత రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్ సేవలు ఎనలేనివని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. శుక్రవారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీడిత ప్రజల ఆశయాలను ప్రతిబింబించేలా రాజ్యాంగాన్ని లిఖించారన్నారు. విభిన్న మతాలు, ఆచార వ్యవహారాల సంఘటిత భారతావనికి స్వపరిపాలన రూపకల్పనను రాజ్యాంగబద్ధం చేశారన్నారు. ప్రాథమిక హక్కులకు రాజ్యాంగంలో పెద్దపేట వేశారన్నారు. బలహీన వర్గాలకు ప్రత్యేక హక్కులు, రిజర్వేషన్లు పొందుపరిచారన్నారు. అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలను అందులో చేర్చి భారత రాజ్యాంగ పితగా అంబేడ్కర్ కీర్తించబడ్డారని జిల్లా రెవెన్యూ అధికారి వి.మదనమోహనరావు అన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ కె.కాశీవిశ్వేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు కుటుంబాన్ని ఆదుకుంటాం



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు, మాజీ ఎంపీ అనురాధ

అల్లవరం: వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి విశేష కృషి చేసిన దేవగుప్తం గ్రామ కమిటీ అధ్యక్షుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు సేవలను పార్టీ గుర్తిస్తుందని మాజీ ఎంపీ చింతా అనురాధ అన్నారు. తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అనురాధ, అగ్రికల్చర్ మిషన్ మాజీ సభ్యులు జున్నూరి రామారావు, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి పాలైన అనంతరం వెంకటేశ్వరరావు మానసిక ఒత్తిడితో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారని మాజీ సీఎం జగన్‌కు అనురాధ తెలిపారు. తన అభిమాన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒక్కసారైనా చూడాలని, కలసి మాట్లాడాలన్న వెంకటేశ్వరరావు కోరికను మాజీ ఎంపీ అనురాధ శుక్రవారం నెరవేర్చారు. వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను జగన్‌మోహన్‌రెడ్డి పలుకరించి, పార్టీ తరఫున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట పెచ్చెట్టి శ్రీను తదితరులు ఉన్నారు.

క్విజ్‌లో విజేతలకు ల్యాప్‌టాప్‌లు

పి.గన్నవరం: అమలాపురంలో శుక్రవారం జిల్లా స్థాయిలో జరిగిన ధీరూబాయి అంబానీ క్విజ్ పోటీల్లో పి.గన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు విజేతలుగా నిలిచి, ల్యాప్‌టాప్‌లను అందుకున్నారని హెచ్ఎం డీఎస్వీ ప్రసాద్ తెలిపారు. విజేత విద్యార్థులు మందపాటి గురు రామ్‌చరణ్, లంకే అజేయుడులు జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌లు అందుకున్నారని అన్నారు. వీరిని పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నల్లా దుర్గారావు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.



క్విజ్ పోటీల్లో విజేతలకు ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న డీఈఓ సలీం బాషా

పోలీస్ శాఖలో హోంగార్డుల సేవలు కీలకం



హోంగార్డులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్: పోలీస్ శాఖలో హోంగార్డుల సేవలు కీలకమని, పోలీసులతో సమానంగా వారూ ట్రాఫిక్ తదితర సేవల్లో నిమగ్నమవుతున్నారని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. హోంగార్డ్స్ 62వ రైజింగ్ డే సందర్భంగా అమలాపురం బాలయోగి స్టేడియంలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రం కాకినాడలో మాత్రమే హోంగార్డ్స్ రైజింగ్ డే వేడుకలు జరిగేవని ఎస్పీ గుర్తు చేశారు. కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాక ఇప్పుడు జిల్లా కేంద్రంలో తొలిసారిగా నిర్వహించడం శుభ పరిణామమని చెప్పారు. జిల్లాలోని హోంగార్డులు విధి నిర్వహణలో ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. అలాంటి వారికి తగిన ప్రోత్సాహకాలు అందించేందుకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఎస్పీ అన్నారు. జిల్లా ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ మాట్లాడుతూ పోలీసు శాఖలో హోంగార్డులకు విధులపరంగా ఎలాంటి పని అప్పగించినా దానికి నూరు శాతం న్యాయం చేస్తారని అన్నారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, ఆర్మ్‌డ్ డీఎస్పీ సుబ్బరాజు, స్పెషల్ బ్రాంచి సీఐ బి.రాజశేఖర్, సోషల్ మీడియా సీఐ జి.వెంకటేశ్వరరావు, అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు తదితరులు పాల్గొన్నారు. హోంగార్డ్స్ రైజింగ్ డే సందర్భంగా ఎస్పీ వారికి స్వయంగా అల్పాహారం వడ్డించారు. తొలుత ఎస్పీకి జిల్లాకు చెందిన హోంగార్డులంతా పూల కుండీలు అందించి స్వాగతం పలికారు.

క్లుప్తంగా

మహిళ మెడలో గొలుసు చోరీ

తాళ్లపూడి: ఇంటి వద్ద పనులు చేసుకుంటున్న ఓ మహిళ మెడలోని మంగళ సూత్రాల తాడును గుర్తు తెలియని వ్యక్తి తెంచుకుని పరారయ్యాడు. ఈ ఘటన శుక్రవారం అన్నదేవరపేటలో జరిగింది. ఆ గ్రామ బీసీ కాలనీకి చెందిన పట్నాల ఉమామహేశ్వరరావు భార్య లక్ష్మి తన ఇంటి వద్ద పెరట్లో పనులు చేసుకుంటుంది. బాత్‌రూమ్ వెనుక వైపు నుంచి గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఒక్కసారిగా ఆమె మెడలోని బంగారు మంగళ సూత్రాల తాడును తెంచుకుని పోయాడు. దాని విలువ రూ.75 వేలు ఉంటుందని బాధితులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ వివరించారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



శంఖవరంలో ఎరువులు, పురుగు మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

శంఖవరం: శంఖవరంలో రెండు ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.స్నేహిత ఆధ్వర్యంలో విజిలెన్స్, వ్యవసాయ, లీగల్ మెట్రాలజీ అధికారులు శుక్రవారం స్థానిక ఇందు ఆగ్రో ఏజెన్సీస్ (ఎరువుల, విత్తనాల దుకాణం)పై మూకుమ్మడి దాడి చేశారు. దుకాణం వద్ద రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేశారు. నిల్వల్లో వ్యత్యాసం ఉండడంతో షాప్ యజమానిపై 6ఏ కేసు నమోదు చేశారు. సుమారు రూ.1,34,213 విలువ గల 11.020 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. అదే దుకాణంలో ఉన్న పారామెక్స్ క్రిమి సంహారక ప్యాకెట్లపై యూనిట్ విక్రయ ధర లేనందున శివకెమ్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేశారు. శ్రీవీరభద్ర ఏజెన్సీస్‌ను తనిఖీ చేయగా షాప్‌లో ఎటువంటి వ్యత్యాసాలు లేవని గుర్తించారు. రీజినల్ విజిలెన్స్ అధికారి ఎం.స్నేహిత మాట్లాడుతూ తమ రీజినల్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలపై నిరంతరం తనిఖీలు కొనసాగుతాయన్నారు. ఈ దాడిలో ఇన్‌చార్జి వ్యవసాయాధికారి ఆర్.ఈశ్వరరావు, విజిలెన్స్ అధికారులు వెంకట నాగరాజు, నవీన్‌కుమార్, వీరబాబు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యానికి మూడుముళ్లు



- బడిబాట వయసులో వివాహాలు
- కుటుంబ బాధ్యతలతో చితికిపోతున్న బాలికలు
- యువతికి 18, యువకుడికి 21 ఏళ్లు నిండాల్సిందే
- బాల్య వివాహాల నిర్మూలనకు టోల్‌ఫ్రీ నంబర్ '1098'

కాకినాడ సిటీ: బడిబాట పట్టాల్సిన బాల్యం ఏడు అడుగులతో బందీ అవుతోంది.. బాల్య వివాహాలతో జీవితానికి చిక్కుముడి పడుతుంది. చిన్నారి పెళ్లి కూతురికి పుస్తెల దండనగా మారుతోంది. పుస్తకాలు పట్టాల్సిన బాలికలు కుటుంబ బాధ్యతలు మోయాల్సిన పరిస్థితి వస్తోంది. పట్టుమని 15 ఏళ్లు నిండని బాలిక భార్యగా, తల్లిగా బాధ్యతలు మోస్తుంది. పేదరికం ఒకవైపు, ఆడపిల్ల భారం తీరుతుందని కన్నవాళ్లే సంసారం అనే సాగరంలోకి నెట్టేయడం ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. 18 ఏళ్లు నిండకుండా వివాహాలు చేస్తే అనారోగ్యం పాలవుతారని వైద్యులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారు. బాల్య వివాహాలు నేరమని, బాలికలు మానసికంగా, శారీరకంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులు అవగాహన కల్పిస్తున్నా మార్పు మాత్రం కనిపించడం లేదు. బాలికల తల్లిదండ్రులకు అక్షరజ్ఞానం, సమాజం పట్ల అవగాహన లేకపోవడం, కుమార్తెకు పెళ్లి చేస్తే భారం తగ్గుతుందనే ఆలోచన, పిల్లలు ప్రేమ వైపు ఆకర్షితులైతే కుటుంబ పరువు పోతుందనే భయంతో బంగారు భవిష్యత్తుకు మాంగల్య బంధనం వేస్తున్నారు. పెళ్లంటే ఏమిటో తెలియని వయసులో అత్తారింటికి సాగనంపుతున్నారు.

అడ్డుకునే అధికారం అందరిదీ

బాల్య వివాహాలను అడ్డుకునే అవకాశం గ్రామ స్థాయిలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సీడీపీవో, మండల స్థాయిలో తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్డీఓలకు ఉంది. ఐసీడీఎస్ తప్ప ఇతర శాఖల అధికారులు దీనిపై దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. బాల్య వివాహాలపై ఎవరైనా 1098కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. సమగ్ర బాలల పరిరక్షణ పథకం కింద ఐసీడీఎస్ ప్రాజెక్టు స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు మండల సమాఖ్య, సంరక్షణ అధికారుల సమన్వయంతో బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తున్నారు. ఈ ఏడాది నుంచి గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో ఉన్న క్షేత్రస్థాయి సిబ్బందికి అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. కాకినాడ జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఐదేళ్లలో 544 బాల్య వివాహాలు అడ్డుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో 537 బాల్య వివాహాలు జరగకుండా ఆపారు. ఏడుగురిపై కేసులు పెట్టారు. అధికారుల దృష్టికి రాకుండా జరిగిపోతున్న పెళ్లిళ్లు అనేకం ఉంటున్నాయి.

జిల్లా	సంవత్సరం	రిపోర్టు చేసిన బాల్యవివాహాలు	ఆపిన పెళ్లిలు	ఎఫ్ఐఆర్ నమోదు చేసినవి
ఉమ్మడి తూర్పుగోదావరి	2019–20	162	161	1
ఉమ్మడి తూర్పుగోదావరి	2020–21	148	145	3
ఉమ్మడి తూర్పుగోదావరి	2021–22	144	144	–
కాకినాడ	2022–23	50	50	–
కాకినాడ	2023–24	40	37	1

వివాహ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

బాల్య వివాహాలను అరికట్టేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళిక చేపట్టారు. జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్, ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో సీడీపీఓలు వివాహ రిజిస్ట్రేషన్ చట్టం-2002 అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ, వార్డు స్థాయిలో మహిళా సంరక్షణ కార్యదర్శుల ద్వారా వివాహ రిజిస్ట్రేషన్లు తప్పనిసరిగా చేయించుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. సంతకం చేసిన దరఖాస్తు ఫారం, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు ఫోటోలు వివాహ పత్రికతో సంబంధిత రిజిస్ట్రేషన్ ఆఫీసులో దరఖాస్తు చేసుకోవాలి. తప్పుడు పత్రాలు సమర్పిస్తే జైలు శిక్షతో పాటు జరిమానా విధించాలనే నిబంధనలు ఉన్నాయి.

పడే శిక్షలు ఇవే..

బాల్య వివాహం చట్టరీత్యా నేరం. పెళ్లి చేసినా, ప్రోత్సహించినా రెండేళ్ల వరకూ జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా పడుతోంది. బాల్య వివాహాల నిర్మూలన, బాలల సంరక్షణ కోసం 1098 టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంది. సమాచారం అందిస్తే సంబంధిత అధికారులు ఆ వివాహాన్ని అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు 18 ఏళ్లు నిండే వరకూ బాలికకు వివాహం చేయబోమని ఒప్పంద పత్రం రాయించుకుంటారు.

జరిగే ముప్పు ఇది..

- బాల్య వివాహాలతో అనేక ప్రమాదాలు సంభవిస్తాయి. బాలికల్లో శారీరక, మానసిక ఎదుగుదల ఉండదు. వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం ఉంటుంది.
- చిన్న వయసులో గర్భం దాల్చే బాలికల్లో గర్భస్రావం ముప్పు ఎక్కువ.
- శిశు మరణాలతో పాటు తల్లుల ప్రాణాలు సంభవించే అవకాశం ఉంటుంది.
- పుట్టిన బిడ్డ తక్కువ బరువుతో ఉంటారు. భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు వస్తాయి.
- 60 శాతం బాలికల్లో రక్తహీనత ఉంటుంది. ఈ క్రమంలో గర్భం దాల్చడం మంచిది కాదు.

సమాచారం ఇవ్వండి



ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వండి. పోలీసు, రెవెన్యూ, చైల్డ్‌లైన్ 1098 ద్వారా వాటిని అడ్డుకుంటాం. బాల్య వివాహాల కారణంగా జరిగే నష్టాలను వివరిస్తున్నాం. బాల్య వివాహాల నిర్మూలనపై అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలు ఇచ్చాం.

–కె.ప్రవీణ, ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారి, కాకినాడ

ప్రాణాలకే ముప్పు



చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల బాలికలు ఎనీమియా బారిన పడే ప్రమాదం ఉంది. ప్రసవం సమయంలో అధిక రక్తస్రావం, అధిక రక్తపోటుతో మరణాలు సంభవిస్తాయి. బిడ్డను మోసే సామర్థ్యం బాలికలకు తక్కువగా ఉంటుంది. దీంతో బిడ్డతో పాటు తల్లికీ ప్రమాదమే.

–జె.నరసింహనాయక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

అందరూ బాధ్యులే..



బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం. బాల్య వివాహం జరిపించిన తల్లిదండ్రులు, సంరక్షకురాలు, అనుమతించిన పెద్దలు, పెళ్లికి సహకరించిన అందరూ నేరస్తులే అవుతారు. బాలికను పెళ్లి చేసుకుని సంసారం చేస్తే పోక్సో కేసు నమోదవుతుంది.

–రఘువీర్ విష్ణు, డీఎస్పీ, కాకినాడ

దారి చూపు స్వామీ..

- మెట్ల దారికి అడ్డుగా వాహనాల పార్కింగ్
- అన్నవరంలో పట్టించుకోని అధికారులు



వనదుర్గమ్మ ఆలయం వద్ద మెట్ల దారికి అడ్డుగా నిలిపిన కార్లు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గమ్మ ఆలయం వద్ద మెట్ల దారికి అడ్డుగా వాహనాలు నిలిపేస్తుండడంతో రాకపోకలు సాగించే భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సత్యదేవుని ఆలయానికి చాలా మంది మెట్లదారి నుంచి వస్తుంటారు. వీరు వనదుర్గ అమ్మవారి ఆలయం వరకూ ఏ ఇబ్బంది లేకుండా వస్తున్నారు. ఈ ఆలయం పక్కన హోమ మండపం వద్ద వాహనాలను మెట్లదారికి అడ్డుగా పెడుతుండడంతో ఆలయానికి ఎలా వెళ్లాలో తెలియక భక్తులు అవస్థలు పడుతున్నారు. చివరికి ఆ వాహనాల పక్కన ఖాళీ లోంచి వెళ్లాల్సి వస్తోంది. శుక్రవారం కూడా ఇదే విధంగా అడ్డుగా వాహనాలు నిలిపివేయడంతో భక్తులు, చండీ హోమానికి హాజరైన వారు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రత్నగిరిపై చాలా చోట్ల పార్కింగ్ స్థలాలు ఉన్నాయి. అయినప్పటికీ కొంతమంది తమ వాహనాలను మెట్ల దారికి అడ్డుగా నిలిపివేస్తున్నారు. ప్రతి శుక్రవారం వనదుర్గమ్మ ఆలయంలో జరిగే చండీ హోమం, పౌర్ణమి, అమావాస్యకు జరిగే ప్రత్యంగిర హోమాల్లో పాల్గొనే భక్తులు కూడా దీనివల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అయినా దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

గంజాయి స్మగ్లింగ్‌పై ప్రత్యేక నిఘా

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



నిడదవోలు పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న ఐజీ అశోక్‌కుమార్

నిడదవోలు: జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా నిడదవోలు పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ముందుగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో గోకవరం, కోరుకొండ, రాజమహేంద్రవరం ప్రాంతాల్లో గంజాయి విక్రయాలపై నిఘా పెట్టామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి రాజమహేంద్రవరానికి వచ్చి ఏజెన్సీ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన గంజాయి విక్రయిస్తున్నారన్నారు. దీనిపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి గంజాయి వ్యాపారులను పట్టుకుంటున్నామన్నారు. ఒడిశా, వైజాగ్ పోలీసులను సమన్వయం చేసుకుని సమాచారం సేకరించి స్మగ్లర్ల కదలికలపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టామన్నారు. పోలీస్ సిబ్బంది కొరతను అధిగమించేందుకు రాష్ట్రంలో త్వరలో పోలీస్ రిక్రూట్‌మెంట్ జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది కొరత ఉన్నా ఆధునిక టెక్నాలజీతో నేరస్తులను పట్టుకుంటున్నామని అన్నారు. ప్రతి జిల్లాలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో ఎక్కువ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించామన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో క్రైం రేటును తగ్గిస్తున్నామన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలో సీసీఎస్ బృందాలు ఉత్సాహంగా పనిచేస్తున్నాయని అన్నారు. వీరికి ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి రైల్వే పోలీస్ సిబ్బందిని కూడా గ్రూపులో చేర్చి జిల్లాల పరిధిలో జరిగే నేరాలను గ్రూపుల్లో పెట్టి నేరాల అదుపునకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం రక్షక బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. జిల్లా ఎస్పీ నరసింహకిశోర్, అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, నిడదవోలు సీఐ పీవీజీ తిలక్, ఎస్సైలు టి.శోభన్‌కుమార్, సతీష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

పి.గన్నవరం: నాగుల్లంక ఉన్నత పాఠశాల విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రాథమిక పాఠశాల ఎంటీఎస్ ఉపాధ్యాయుడు పిండి శ్రీనివాస్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి సలీం బాషా ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈఓ కోన హెలీనా తెలిపారు. ఉపాధ్యాయుడి వేధింపులపై జిల్లా విద్యాశాఖ అధికారి సలీం ఇటీవల పాఠశాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులతో విచారణ నిర్వహించారు. ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన నిర్ధారణ కావడంతో అతడిని సస్పెన్షన్ చేసినట్లు ఎంఈఓ వివరించారు.

ఇసుక లారీని ఢీకొన్న వ్యాన్ : డ్రైవర్ మృతి



నరసింహులు (ఫైల్)

నల్లజర్ల: దూబచర్ల సమీపంలో శుక్రవారం ఉదయం లారీని వ్యాన్ ఢీకొన్న ఘటనలో వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. అనంతపురం జిల్లా తాడిపర్తి మండలం చుక్కలూరు గ్రామానికి చెందిన శ్యామర్ల నరసింహులు (30) తన గ్రామం నుంచి దానిమ్మ కాయల లోడుతో వ్యాన్‌పై బయలుదేరాడు. రాజమహేంద్రవరం వస్తుండగా దూబచర్ల వద్ద ఆ వ్యాన్ ముందు టైరు పేలిపోయి అదుపు తప్పింది. తర్వాత డివైడర్‌ను దాటి కొవ్వూరు నుంచి ఏలూరు వైపు వస్తున్న ఇసుక లారీని ఢీకొంది. ఈ సంఘటనలో వ్యాన్ డ్రైవర్ నరసింహులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య మహాలక్ష్మి, కుమారుడు మనోజ్ ఉన్నారు. గతంలో ఒకరి వద్ద డ్రైవర్‌గా పనిచేసిన నరసింహులు ఇటీవల వ్యాన్ కొనుగోలు చేసి కిరాయిలకు తిప్పుతున్నాడు. గురువారం రాత్రి ఒంటి గంట సమయంలో రాజమహేంద్రవరం వెళ్లి త్వరగా వచ్చేస్తానని చెప్పి ఇక్కడ మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులంతా శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సోమరాజు తెలిపారు.

శంఖాన్ని పూరించి.. శివయ్యను పిలిచి

- ఎస్‌పీఎఫ్ కమాండెంట్ దంపతుల శంఖనాదం సాధన
- రేపు కామధేను జాతీయ పురస్కారం ప్రదానం



తిరుపతిలో శంఖం పూరిస్తున్న ఎస్‌పీఎఫ్ కమాండెంట్ నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్/పి.గన్నవరం: శివయ్యను ప్రసన్నం చేసుకునేందుకు భక్తులు అనేక మార్గాలను అనుసరిస్తారు.. శంఖాన్ని ఏకబిగిన పూరిస్తూ మహాదేవుడిని ఆనందింపజేస్తారు మరికొందరు.. శ్వాసను బిగించి ఏకధాటిగా దాదాపు ఇరవై నిమిషాల పాటు శంఖాన్ని పూరిస్తూ తమ భక్తిని ప్రదర్శిస్తున్న ఎస్‌పీఎఫ్ కమాండెంట్ నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులకు ఆధ్యాత్మిక సంపూర్ణత్వంతో పాటు, భౌతికంగా కూడా అవార్డులు వరిస్తున్నాయి. వీరు చేసే ఆధ్యాత్మిక సేవ అవార్డుల కోసం కాకపోయినప్పటికీ శంఖనాదంలో వీరి నిపుణతకు హైదరాబాద్‌కు చెందిన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ కామధేను-2024 అవార్డ్స్‌లో భాగంగా జాతీయ పురస్కారానికి ఎంపిక చేసింది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో నరసింహారావు దంపతులు ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ సందర్భంగా తమ ఆధ్యాత్మిక మార్గం, శంఖనాదం సాధన గురించి నరసింహారావు మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం తమ స్వగ్రామమని అన్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఏపీ ప్రత్యేక రక్షణ దళం (ఏపీఎస్‌పీఎఫ్) కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నానన్నారు. తన భార్య అలివేలు మంగాదేవి గృహిణి అని, తమకు శివుడు అంటే ఎనలేని భక్తి అని చెప్పారు. తాను 1989లో పశ్చిమ బెంగాల్ సిలిగురి ప్రాంతంలో సరిహద్దు భద్రత దళంలో పనిచేసే సమయంలో బెంగాలీ పూజారి చక్రవర్తి వద్ద శంఖం పూరించడంలో మెలకువలు నేర్చుకున్నానని వివరించారు. అదే స్ఫూర్తితో తన భార్య మంగాదేవి పట్టు సాధించారన్నారు. దీంతో తమకు 'అఖండ శంఖారావ యుగళం'గా పేరొచ్చిందన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు, కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో 35 సంవత్సరాలుగా సొంత ఖర్చులతో ఇంత వరకూ నాలుగు వేలకు పైగా కార్యక్రమాలు తమ శంఖారావంతో ఆరంభమయ్యాయని అన్నారు. గోదావరి, కృష్ణా పుష్కరాలు, ఇబ్రహీంపట్నం పవిత్ర నదీసంగమ అనుసంధానం వంటి పెద్ద కార్యక్రమాల్లో శుభసూచికంగా అఖండ శంఖారావం పూరించామన్నారు. ఈ సందర్భంగా పలు సంస్థల నుంచి గౌరవ డాక్టరేట్లు, అవార్డులు, మంత్రుల చేతుల మీదుగా సత్కారాలు, సువర్ణ ఘంటాకంకణాలు లభించాయన్నారు. ఇదంతా కేవలం సాధనతోనే సాధ్యమైందని, పదేళ్లపాటు దీన్ని సాధన చేశామని నరసింహారావు దంపతులు పేర్కొన్నారు.

విజేతలకు అభినందన



పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులతో డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జేఎన్‌టీయూలో జిల్లా కర్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 5వ ఆంధ్రప్రదేశ్ కర్లింగ్ చాంపియన్ షిప్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ అభినందించారు. శుక్రవారం స్థానిక డీఎస్ఏలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 11 జిల్లాల నుంచి 120 మంది బాలురు, 70 మంది బాలికలు పోటీలకు హాజరయ్యారన్నారు. జిల్లా క్రీడాకారులు సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో 10 బంగారు, బాలికల విభాగంలో 5 బంగారు, మిక్స్‌డ్ డబుల్స్‌లో 4 బంగారు పతకాలు సాధించారన్నారు. జూనియర్స్ బాలుర విభాగంలో 5 బంగారు, మిక్స్‌డ్ డబుల్స్‌లో 2 బంగారు, సీనియర్స్ బాలుర విభాగంలో 5 బంగారు, 4 కాంస్య, 2 రజత, బాలికల విభాగంలో 4 రజత, మిక్స్‌డ్ డబుల్స్‌లో 4 రజత పతకాలు సాధించారని తెలిపారు. విజేతలను శ్రీనివాస్ కుమార్, కర్లింగ్ సంఘ అధ్యక్షురాలు తేజశ్రీ, కార్యదర్శి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు రూ.లక్ష విరాళం



రాజమహేంద్రవరం ఆసుపత్రిలో రాజేష్ కుటుంబానికి రూ.లక్ష సాయం అందజేస్తున్న కానిస్టేబుళ్లు

కొవ్వూరు: నిడదవోలు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న టి.రాజేష్‌కు అనారోగ్యం కారణంగా కిడ్నీ ఆపరేషన్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి వైద్య ఖర్చుల నిమిత్తం సహాయ ఫౌండేషన్ 2009 సివిల్ కానిస్టేబుళ్లు అంతా కలసి రూ.లక్ష సేకరించారు. ఆ సొమ్మును డివిజన్‌లో పనిచేస్తున్న ఆ బ్యాచ్ కానిస్టేబుళ్లు శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు కిషోర్, రాజేష్, రమణ, శ్రీనివాస్, వెంకట రమణ, రామారావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

25 మెట్రిక్ టన్నుల బియ్యం స్వాధీనం



కోళ్లఫారంలో అక్రమంగా నిల్వ చేసిన బియ్యం

తుని రూరల్: తుని మండలం కొలిమేరు శివారు కోళ్లఫారంలో అక్రమంగా నిల్వ చేసిన 25 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారంతో ఎంఎస్‌ఓ బి.రాజు, ఆర్ఐ తాతారెడ్డి, వీఆర్వో శివరామకృష్ణ, రెవెన్యూ సిబ్బందితో కలసి వెళ్లి కోళ్లఫారంలో అక్రమంగా నిల్వ చేసిన బియ్యాన్ని గుర్తించారు. 50 కిలోల సంచుల్లో ఉన్న 510 బస్తాల బియ్యం ఉంది. కోళ్లఫారం నిర్వాహకుడు వేగిశెట్టి యేసుబాబును ఎంఎస్‌ఓ రాజు ప్రశ్నించగా, కోళ్ల మేతకు తీసుకు వచ్చినట్టు పేర్కొన్నాడు. రేషన్ బియ్యం ఆనవాళ్లు లేకపోవడంతో పరీక్షల నిమిత్తం నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తున్నట్టు ఎంఎస్‌ఓ తెలిపారు. పరీక్షల నివేదిక వచ్చే వరకూ కోళ్లఫారాన్ని సీజ్ చేసి బియ్యానికి వీఆర్వోలను కాపలా ఉంచినట్టు ఆయన అన్నారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.పది లక్షలు ఉంటుందని అంచనా.